
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శనివారం 19 అక్టోబరు 2024

26న నర్సాపూర్‌లో అదనపు కోర్టు ప్రారంభం

నర్సాపూర్, అక్టోబరు 18: నర్సాపూర్‌కు అదనపు కోర్టు మంజూరు కాగా ఈ నెల 26న హైకోర్టు జడ్జి విజయసేనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ప్రస్తుతం నర్సాపూర్‌లో ఉన్న జూనియర్ సివిల్ కోర్టు భవనం పక్కనే ఖాళీగా ఉన్న మానసిక వికలాంగుల కేంద్రం కొనసాగిన భవనంలో అదనపు కోర్టు ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఆ భవనాన్ని కోర్టుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి కె.అనితతో పాటు న్యాయవాదులు పరిశీలించారు.

కమిటీల కయ్యాలు

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక కమిటీలపై వివాదాలు

- గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఏడుగురి చొప్పున నియామకం
- కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో జాబితాలు..?
- ఆ పార్టీలోనూ గ్రూపు రాజకీయాలు
- శ్రేణుల అసంతృప్తిరాగం
- ప్రత్యేక జాబితాలు తయారుచేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఉమ్మడి జిల్లాలో ఎంపీడీవోలు, ఉన్నతాధికారులకు తలనొప్పి

'ఝరాసంగం మండలంలో ఇందిరమ్మ కమిటీలను ఏకపక్షంగా ఎంపిక చేస్తున్నారని, కమిటీల్లో కాంగ్రెస్ కార్యకర్తలకే చోటు కల్పిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఇటీవల నిరసన తెలిపారు. ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వకుండానే ఎలా ఎంపిక చేస్తారని ఎంపీడీవోపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు.'

'మనోహరాబాద్ మండలం కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో కార్యదర్శి ఒక జాబితాను తయారు చేసి ఎంపీడీవోకు పంపించారు. ఈ విషయం తెలిసి గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీడీవోను కలిసి ఆ జాబితాను రద్దు చేయాలని కోరినట్లు తెలిసింది.'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, అక్టోబరు 18: ఇందిరమ్మ ఇళ్లను నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. క్షేత్రస్థాయిలో అర్హుల ఎంపిక కోసం కమిటీలను నియమిస్తున్నది కమిటీలతో కయ్యం పుట్టుకొస్తున్నది. కమిటీలపై ఆధిపత్యం కోసం అధికార కాంగ్రెస్ నేతలు పట్టుబడుతుండగా.. బీఆర్ఎస్ శ్రేణులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఇక గ్రామసభలు లేకుండా కమిటీల ఎంపిక కుదరదని బీజేపీ నాయకులు వాదిస్తున్నారు. అంతేగాకుండా కాంగ్రెస్ శిబిరంలోని గ్రూపు రాజకీయాలు సైతం కమిటీలను అభాసుపాలు చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐదుగురు సభ్యులపైనే రాద్ధాంతం

గ్రామాల్లో సర్పంచ్ లేనందున ప్రత్యేకాధికారే కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. మున్సిపల్ వార్డుల్లో కౌన్సిలర్ అధ్యక్షుడిగా, వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే ఉంది. వీరు కాకుండా మరో ఐదుగురు సభ్యులను కమిటీలో నియమించాల్సి ఉంటుంది. ఈ ఐదుగురిలో ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, మరో ముగ్గురు గ్రామ అభివృద్ధిని కాంక్షించేవారై ఉండాలి. ఇందులో ఎస్సీ,బీసీ,ఓసీ సామాజిక వర్గాల వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఇద్దరు మహిళలను, ముగ్గురు వ్యక్తులను కమిటీల్లో ఎంపిక చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మిగతాది 7వ పేజీలో..



గ్రామసభలు లేకుండానే ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేశారని కొడిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు (ఫైల్)

మరో రెండు డయాలసిస్ కేంద్రాలు

సదాశివపేట, పటాన్‌చెరులో ఐదు పడకల చొప్పున ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ సమస్యలున్న బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం మరిన్ని ఉచిత డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే నాలుగు ఉచిత డయాలసిస్ కేంద్రాలు ఉండగా.. మరో రెండుచోట్ల త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను నెలకొల్పారు. జిల్లాలో ఈ కేంద్రాలు కొనేళ్లుగా కిడ్నీ బాధితులకు భరోసా కల్పిస్తున్నాయి. కొత్తగా సదాశివపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐదు పడకల చొప్పున త్వరలోనే రోగులకు అందుబాటులోకి రానున్నాయి.

ఇప్పటికే నాలుగు.. కొత్తగా రెండుచోట్ల


జిల్లాలో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో 9 పడకలు, జోగిపేటలో-5, జహీరాబాద్‌లో-5, నారాయణఖేడ్‌లో-5 పడకలతో డయాలసిస్ సెంటర్లను నెలకొల్పారు. ఈ ఏడాది జూన్‌లో సంగారెడ్డి, జహీరాబాద్ ఆస్పత్రుల్లోని కేంద్రాల్లో అదనంగా ఐదు పడకల చొప్పున సర్కారు పెంచింది. తాజాగా సదాశివపేట, పటాన్‌చెరు ఆస్పత్రుల్లో కొత్తగా ఐదు పడకలతో డయాలసిస్ కేంద్రాల మంజూరు చేయడంతో జిల్లాలో సర్కారు దవాఖాల్లో ఉచిత డయాలసిస్ కేంద్రాల సంఖ్య ఆరుకు చేరనుంది.

ఏటీసీ కేంద్రాల్లో ప్రవేశాలను వేగవంతం చేయండి : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 18 : జిల్లాలో ఏటీసీ కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. జిల్లా అధికారులతో శుక్రవారం ఆమె వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటీసీ కేంద్రాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, శిక్షణ ప్రారంభించేందుకు ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో తాను ఏర్పాట్లను పరిశీలిస్తానని తెలిపారు. తొలివిడతలో జిల్లాలో శిక్షణ కోసం సంగారెడ్డి, హత్నూర ఐటీఐలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఏటీసీల్లో చేరేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని వెల్లడించారు. పూర్తి వివరాలకు సంగారెడ్డి ఐటీఐ ప్రిన్సిపాల్‌ను 9848935146, హత్నూర ప్రిన్సిపాల్‌ను 9963004960 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అలాగే, నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్-2, 3, పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాల్లో మొత్తం 17వేల మంది అభ్యర్థులకు 49 పరీక్ష కేంద్రాలను గుర్తించామని తెలిపారు. ఇప్పటికే అధికారులు పరీక్ష కేంద్రాల్లో సందర్శించి వసతులను పరిశీలించారని కలెక్టర్ వివరించారు.

పటాన్‌చెరు గులాబీ బాస్ ఎవరు?

- నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ నియామకంపై తర్జనభర్జనలు
- ముఖ్య నాయకులతో హరీశ్‌రావు సమావేశం



పటాన్‌చెరు నియోజకవర్గ మ్యాప్

పటాన్‌చెరు, అక్టోబరు 18 : పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ అధిష్ఠానం దృష్టిసారించింది. పార్టీ క్యాడర్‌ను కాపాడుకుని పూర్వవైభవం కొనసాగించేందుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్‌రావు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి హరీశ్‌రావుకు పటాన్‌చెరు నియోజకవర్గంతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఇక్కడి నాయకులంతా ఆయన నాయకత్వంలోనే పని చేస్తూ వస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ ప్రభంజనాన్ని తట్టుకుని బీఆర్ఎస్ గెలుపొందేందుకు హరీశ్‌రావు ఎంతో కృషి చేశారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా పార్టీ ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ మారకుండా కట్టడి చేయడంలో హరీశ్‌రావు విజయం సాధించారనే చెప్పాలి. స్థానిక సంస్థలు దగ్గరపడుతున్న తరుణంలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులను ఏకతాటిపైకి తెచ్చి సత్తా చాటేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి అప్పగిస్తే బాగుంటుందని సమాలోచన చేస్తున్నారు. ఇటీవల తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఉన్న నాయకులలో ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందన్న కోణంలో నాయకుల అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశం గౌడ్, భారతీనగర్ కార్పొరేటర్ సింధు, నాయకులు ఆదర్శరెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, గుమ్మడిదల నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా కలిసికట్టుగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని హరీశ్‌రావు ముందు వారు స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే, ఎవరో ఒకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకుండా స్టీరింగ్ కమిటీ వేయాలని ఓ ప్రజాప్రతినిధి సూచించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆలోచించి వారంలోగా తేల్చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్లు సపానాదేవ్, శంకర్‌యాదవ్, పటాన్‌చెరు మాజీ సర్పంచ్ దేవేందర్‌రాజులు ఈ సమావేశంలో పాల్గొనలేదు. వారి అభిప్రాయం సైతం పరిగణలోకి తీసుకుని ఇన్‌చార్జిని ప్రకటించే అవకాశలున్నాయని తెలిసింది.

ఆర్‌ఎంపీలపై నిఘా

వైద్యాధికారుల తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 : ఆర్‌ఎంపీలు అనుమతించిన దానికిమించి వైద్యం చేస్తున్నా? ప్రథమ చికిత్స మాత్రమే కాకుండా వ్యాధులకు మందులిస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారా? అని పరిశీలించేందుకు వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు చేపడుతున్నది. సంగారెడ్డి జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లను పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు తనిఖీ చేస్తున్నారు. మూడు రోజుల ఈ డ్రైవ్ నేటితో ముగియనున్నది. మెడికల్ ఆఫీసర్లకు ఇచ్చిన చెక్‌లిస్ట్ ఆధారంగా రెండ్రోజులుగా జిల్లాలో తనిఖీలు చేస్తున్నారు. క్లినిక్‌లపై ఆర్‌ఎంపీ అని కాకుండా డాక్టర్ అని రాసుకున్నారా? బెడ్‌లు వేసి చికిత్స చేస్తున్నారా? సెలైన్, స్టెరాయిడ్స్ యాంటిబయోటిక్స్, ఇతర మందులేమైనా ప్రజలకు ఇస్తున్నారా? అనే వివరాలను సేకరిస్తున్నారు. ప్రథమచికిత్సకు మించి వైద్య సేవలందిస్తే అప్పటికప్పుడు ప్రోగ్రాం ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్ చేయిస్తున్నారు. ఈ నెల 17వ తేదీన చేపట్టిన తనిఖీల్లో పటాన్‌చెరు, ఆర్సీపురంలో ఒక్కో క్లినిక్‌ను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన క్లినిక్‌లలో కూడా ఈరోజు తనిఖీలు పూర్తిచేయనున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మెడికల్ ఆఫీసర్లు ఇచ్చిన రిపోర్టును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వానికి నివేదించనున్నది.

బోనస్‌పై గుడ్‌న్యూస్

సన్నాల ఎంపికకు మార్గదర్శకాలు.. 33 రకాలకు చెల్లింపులు



హవేళిఘనపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బోనస్‌పై రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్వింటాలుకు రూ.500 అదనంగా చెల్లించడానికి విధివిధానాలను రూపొందించింది. సన్నాలలోని 33 రకాలకు బోనస్‌ను వర్తింపజేశారు. గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా, తేమ శాతం 17కు మించకుండా ఉన్నప్పుడే బోనస్ అందించనున్నారు. వీటిని గుర్తించేందుకు ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద డబుల్ గ్రీన్ క్యాలిపర్స్ అనబడే మైక్రో మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం గ్రేడ్-ఏ వడ్లకు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300 మద్దతుధరను ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అదనంగా సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ పద్ధతి ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టి, రైతులకు చెల్లిస్తున్న డబ్బుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి లెక్కచూపాల్సి ఉంటుంది. బోనస్‌తో కేంద్రానికి సంబంధం ఉండని నేపథ్యంలో మద్దతుధరతో కలిపి బోనస్ ఇస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు ఆక్షేపిస్తున్నట్లు సమాచారం.

జిల్లాలో భారీగా సన్న ధాన్యం దిగుబడులు

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో సన్నరకం ధాన్యం పంట దిగుబడులు భారీగా వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సుమారు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుండగా అందులో 2 లక్షల 20 వేల ఎంటీలు సన్నాలు వస్తాయని అంచనా. జిల్లాలో ఆమని, సూపర్ ఆమని, జేజేలు, ధనిష్ఠ, గాయిత్రి తదితర సన్నరకం ధాన్యాన్ని పండించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న 33 రకాలలో ఈ బ్రాండ్లు లేవు. అయినప్పటికీ, ధాన్యం సైజు సరిపోయినట్లయితే బోనస్ చెల్లిస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం హరికృష్ణ తెలిపారు.

అందోలు నియోజకవర్గంలో

విద్యుత్ సమస్యలు తలెత్తకూడదు

ట్రాన్స్‌కో అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం



మంత్రి దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

జోగిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అందోలులో ఎటువంటి విద్యుత్ సమస్యలూ తలెత్తకూడదని, ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదు రావొద్దని, ఆదిశగా చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదారబాద్ సచివాలంలోని తన ఛాంబర్‌లో మేడ్చల్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ కామేశ్, ఇతర అధికారులతో నియోజకవర్గ విద్యుత్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం, గృహ విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లేకుండా చూడాలన్నారు. వేసవి కాలం ప్రారంభమయ్యేలోగానే అన్ని సమస్యలనూ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పనుల కోసం అవసరమైనన్ని 33 కేవీ సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్‌లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును పూర్తి చేయాలన్నారు. ఈ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాలని ఆదేశించారు. రూ.9 కోట్ల మేర నిధులు అవసరమౌతాయని సంగారెడ్డి జిల్లా ఎస్ఈ శ్రీనాథ్, జోగిపేట డివిజన్ ఇంజనీర్ శ్రీనివాస్ మంత్రికి వివరించగా మంత్రి వెంటనే మంజూరు చేస్తానన్నారు. సమీక్షలో సంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్, జోగిపేట డీఈ శ్రీనివాస్, ఏడీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మతి స్థిమితం లేని వ్యక్తికి స్నానం చేయించి దుస్తులు వేస్తున్న గంగా జమునా.. సభ్యులు

గంగా జమునా తహజీబ్

- సేవే లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ
- కుల మతాలకు అతీతంగా సభ్యులు
- అనాథ శవాలకు అంత్యక్రియలు
- మానసిక దివ్యాంగులకు చేయూత
- ఉచిత అంబులెన్స్ సేవలు

7

పాఠశాల ఇలా..

చదువు సాగేదెలా?

- సమస్యల వలయంలో మారేపల్లి ప్రాథమిక పాఠశాల
- నూతన భవన నిర్మాణానికి గ్రహణం
- పంచాయతీ భవనంలోనే తరగతులు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- ముక్కుపుటలదిరే దుర్వాసన

8

ఈ దారి.. రహదారే!!

వాహనాలకు గండం.. ప్రయాణికులకు ప్రాణసంకటం



జహీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ బైపాస్ చౌరస్తా మీదుగా అల్గోల్, భరత్‌నగర్, బీదర్‌రోడ్డు, పొట్టిపల్లి, ఎల్గోయి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. భరత్‌నగర్ సమీపంలో డౌన్‌టౌన్ వద్ద రోడ్డుపై మురుగు, వర్షపునీరు చేరడంతో కాల్వను తలపిస్తున్నది. పెద్దవాహనాలు రోడ్డుపై దిగబడుతున్నాయి. కార్లు, ఆటోలు, బైక్‌లు బురదలో జారి ప్రమాదాలకు గురవుతున్నాయి. బైపాస్‌రోడ్డు నుంచి కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి వరకు 200 మీటర్ల మేర మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొంటున్నారు.

కంకర తేలి.. గుంతల మయంగా..





రాళ్లు తేలి ప్రమాదకరంగా మారిన చేర్యాల-ఇంద్రకరణ్ రోడ్డు

కంది, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని అనేక గ్రామాల ప్రధాన రహదారులు గుంతలు పడి, రాళ్లు తేలి వాహనాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రాత్రి వేళ రోడ్లపై ఉన్న గుంతలు కనిపించక అనేక ప్రమాదాలు జరిగాయి. చిమ్నాపూర్, చేర్యాల, ఇంద్రకరణ్, కాశీపూర్-కలివేముల, తోపుగొండ, మక్తాఅల్లూరు, ఉత్తరపల్లి, బ్యాతోల్ గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా తయారయ్యాయి. చాలా ఏళ్లుగా కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయకపోవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం పడితే ఈ గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళ ఈ రహదారులపై ప్రయాణం అంటేనే ప్రజలు భయపడుతున్నారు. సంవత్సరాలుగా కనీసం గుంతలను పూడ్చే పనులు కూడా చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ తెలిపారు.

మునిపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

మునిపల్లి, అక్టోబరు(ఆంధ్రజ్యోతి)18 : మునిపల్లి పోలీస్‌స్టేషన్‌ను సంగారెడ్డి ఎస్పీ రూపేష్ గువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కేసుల నమోదును ఆయన పరిశీలించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ సంజీవరావ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, ఎస్ఐ రాజేష్‌నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలి

● సంగారెడ్డి డీపీవో సాయిబాబా



మురుగు కాలువను పరిశీలిస్తున్న డీపీవో

కొండాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలి జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సూచించారు. ఫ్రై డే- డ్రై డే సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామాన్ని డీపీవో సందర్శించి గ్రామంలో స్వచ్ఛత, పారిశుధ్యం పనులపై ఆరా తీశారు. తాగునీటి సరఫరా, చెత్తసేకరణ, మురుగు కాలువల పరిశుభ్రత తదితర పనులను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి పరిసరాల పరిశుభ్రత, మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందిస్తున్న ఆహారం, సేవలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో 3వేలకుపైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మన్‌మోహన్,కిషోర్ తదితరులు ఉన్నారు.

● జహీరాబాద్ : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే - డ్రై డే సందర్భంగా ఆయన మండలంలోని సత్వార్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో పోగైన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని, చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లోనే వేయాలని సూచించారు. వెంట ఎంపీడీవో మహేందర్ రెడ్డి, అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులు

ఆరోగ్యానికి హానికరం

● పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి

కంది, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంది జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరెట్, జరదా, తంబాకు, పాన్‌మసాల లాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనేనా ఉపయోగించవద్దన్నారు. వీటి వాడకంతో హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులు వాడే వారికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేస్తే సెక్షన్ 4 ప్రకారం రూ.200 జరిమానాను విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన

కోహీర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దిగ్వాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రవణ్ కుమార్ ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్యవివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, ఫోక్సో చట్టం తదితర అంశాలపైన వివరించారు. విద్యార్థినులు వీటన్నిటిపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్‌మీడియాను ఎక్కువగా వాడరాదని సూచించారు. మంచి విషయాలను గ్రహించి, చెడును వెంటనే తిరస్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వసంత్‌రాజు, చంద్రశేఖర్, ముజీబ్, శ్రీనివాస్, సీఆర్పీ జర్నప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



గణేష్ (ఫైల్)

నర్సాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బ్యాగరి గణేష్(45) ఈ నెల 16న ఉదయం కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం గాలించిన కుటుంబీకులకు 17న సాయంత్రం గ్రామ శివారులోని పెద్ద చెరువులో అతడి మృతదేహం లభించింది. కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి ఉంటాడని భావిస్తున్నారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెను తప్పించబోయి వ్యక్తి...

చిలప్‌చెడ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గేదెను తప్పించబోయి కిందపడడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధారబోయిన వీరేశం (49) 17న సాయంత్రం పొలం నుంచి బైకుపై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని కస్తూర్బా పాఠశాల సమీపంలో రాగానే అడ్డుగా వచ్చిన గేదెను తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. దీంతో అతడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని వ్యక్తి..

మెదక్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హార్వెసర్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే కామారెడ్డి జిల్లా రాజాంపేట మండలం గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరిఫ్ బతుకు దెరువు కోసం మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో బజ్జీల బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మంబోజిపల్లి-చిట్యాల రోడ్డుపై ఆరిఫ్‌ను హార్వెస్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. హార్వెస్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తన భర్త మరణించాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మమత(ఫైల్)

పుల్‌కల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే చౌటకూర్ మండలం గంగోజీపేట గ్రామానికి చెందిన కాశపాగ బాలయ్య కూతురు మమత(24)కు భర్తతో విడాకులు తీసుకుని గ్రామంలోని నాయనమ్మ వద్ద ఉంటున్నది. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికెళ్లిన ఆమె శుక్రవారం చక్రియాల గ్రామ శివారులో హన్నాపూర్ గ్రామం వద్ద 161 జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. సమాచారం అందుకున్న సీఐ అనిల్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవుసులపల్లిలో వ్యక్తి..



శివ (ఫైల్)

మెదక్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ పట్టణంలోని అవుసులపల్లిలో గురువారం రాత్రి జరిగింది. మృతుడి తల్లి లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగారం శివ (23) సాయంత్రం తన బావ కుమారుడితో కలిసి మద్యం సేవించాక బయటకెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఇంటి పరిసరాలలో వెతకగా గడ్డివాము వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



అన్న వితరణ కోసం కూరగాయలు కోస్తున్న సభ్యులు



వృద్ధుడికి సాయం చేస్తూ..

గంగా జమునా తహజీబ్

- సేవే లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ
- కుల మతాలకు అతీతంగా సభ్యులు
- అనాథ శవాలకు అంత్యక్రియలు
- మానసిక దివ్యాంగులకు చేయూత
- ఉచిత అంబులెన్స్ సేవలు



ఉచిత అంబులెన్సు సేవలు

మెదక్ కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : నేటి యువతలో ఎక్కువ మంది రీల్స్, లైక్స్, షేర్ అంటూ కాలం గడుపుతుంటే వారు మాత్రం తమకు దొరికిన కొద్ది సమయాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. గంగా జమునా తహజీబ్.. పేరుకు తగ్గట్లుగానే ఆ సంస్థ సభ్యులు అనాథలు, అభాగ్యులు, మానసిక దివ్యాంగులు.. ఆపదలో ఉన్న వారు ఎవరైనా సేవకు సై అంటారు. వారికి మేమున్నామంటూ బాసటగా నిలుస్తున్నారు. ఉన్నంతలో పది మందికి సాయం చేయాలని సంకల్పించి.. ముందుకు సాగుతున్నారు. సేవే లక్ష్యంగా పేదింటి ఆడపిల్లలకు పెళ్లిళ్లు, విద్య, వైద్యం అందించడంతో పాటు అనాథ శవాల ఖననం, మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వడం, శ్మశానాల్లో పిచ్చి మొక్కలు తొలగించడం, అంబులెన్స్ సేవలు ఇలా పలు రకాల సేవలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మెదక్ జిల్లా కేంద్రంలోని అరబ్ గల్లీకి చెందిన గంగా జమున తెహజీబ్ సంఘ సభ్యులు.

అనాథ శవాలకు ఆ నలుగురు..

గంగా జమున తహజీబ్ పేరిట సామాజిక సేవ సంస్థ ఏర్పాటై కేవలం మూడేళ్లు మాత్రమే అవుతోంది. ఈ కొద్దికాలంలోనే సంస్థ సభ్యులు వేర్వేరు చోట్ల అనాథలుగా పడి ఉన్న మృతదేహాల ఖననానికి మేమున్నామని ముందుకు వచ్చారు. జిల్లా కేంద్రం, పరిసర గ్రామాల్లో 12 అనాథ శవాలను ఖననం చేశారు. మరణించిన తర్వాత కనీసం సొంత ఇంటికి వెళ్లే పరిస్థితి లేని వారుంటే వారినీ ఇంటికి చేర్చడంలో తమ వంతు పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఆరుగురిని ఇలా వారి స్వగృహాలకు చేర్చారు. 9 మంది పేదింటి అమ్మాయిలకు ఉచితంగా వివాహాలు జరిపించారు. రోడ్లపై ఎక్కడైనా మానసిక దివ్యాంగులు కనిపిస్తే వారిని చేరదీసి.. వారికి కటింగ్, స్నానం చేయించి.. వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలిస్తారు.

ఉచితంగా అంబులెన్స్

గంగా జమున తహజీబ్ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మెదక్‌కు చెందిన బంగారం వ్యాపారి నసీర్ అంబులెన్స్ వాహనాన్ని సమకూర్చగా.. దానిని సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాలనుకునే వారు పెట్రోలుకు రూ.1500, డ్రైవర్‌కు రూ. 500 ఇస్తే చాలు గమ్యస్థానానికి చేరుస్తున్నారు. ఆ డబ్బులూ ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ఉచితంగా అంబులెన్స్ అందిస్తున్నారు.

కుల మతాలకతీతంగా సభ్యులు..

గంగా జమునా తహజీబ్ అన్న పేరుకు తగ్గట్లుగానే ఇందులో సభ్యులు కూడా కులమతాలకు అతీతంగా ఉన్నారు. సంస్థ అధ్యక్షుడిగా వాసిం, సభ్యులుగా ప్రవీణ్, నవీద్, నజీబ్ , సులేమాన్, రేహాన్, లయిక్, వాజిద్, సురేష్, మహబూబ్, నజీమ్, మసూద్, గౌస్, ఆమేర్, ఆసిఫ్, ఇష్తికార్, రిహాన్, బాబు, తదితరులు ఉన్నారు.

సేవ చేయడంలో ఉన్న సంతృప్తి వేరు



ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి సేవ చేయడంలో ఉన్న తృప్తి ఇంకెక్కడా దొరకదు. చిన్న కుటుంబంలో పుట్టినా.. సేవ చేయాలనే సంకల్పంగా గంగా జమునా తహజీబ్ సంస్థను ఏర్పాటు చేశాను. సభ్యుల సహకారంతో సేవ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు దాతలు కూడా సహకరిస్తున్నారు.

-వాసిం, గంగా జమున తహజీబ్ సంస్థ అధ్యక్షుడు

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

రామాయంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపడం లేదంటూ విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. మూడు గ్రామాల విద్యార్థులు రామాయంపేట-అక్కన్నపేట రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఒకే ఒక్క బస్సు నడపటం.. అదీ కూడా సమయానికి రాకపోవడంతో చదువుకునేందుకు రామాయంపేట వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించే దాకా ఆందోళన విరమించబోమంటూ భీష్మించి కూర్చున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై బాలరాజ్ అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. విద్యార్థుల ఆందోళనకు ఏబీవీపీ మద్దతుగా నిలిచింది.

చిన్నారి మృతితో సీహెచ్‌సీ ఎదుట ఆందోళన



కల్హేర్ పీహెచ్‌సీ దుట ధర్నా చేస్తున్న బాధితులు, యువకులు

కల్హేర్, అక్టోబరు 18: మూడు నెలల చిన్నారి మృతికి టీకానే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ శుక్రవారం కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు వివరాల్లోకి వెళ్లితే కల్హేర్‌కు చెందిన కొక్కొండ ఓంసాయి, అనిత దంపతుల కూతురు ఆరాధ్య(3 నెలలు)ను టీకాల కోసం బుధవారం కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. టీకా వేసిన అనంతరం పాప ఏడ్వడం ఆపకపోవడంతో వైద్యాధికారి అనిల్‌రెడ్డి దగ్గరికి తీసుకువెళ్లారు. కాసేపటికి చిన్నారి అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో వైద్యాధికారి సూచనమేరకు కామారెడ్డి జిల్లా బాన్స్‌వాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు గురువారం కల్హేరు పీహెచ్‌సీ ఎదుట ఆందోళనకు దిగగా వైద్యాధికారి సెలవులో ఉన్నట్లు తెలిసింది. దీంతో తిరిగి శుక్రవారం ఆందోళన చేపట్టారు. దీనిపై కల్హేర్ సీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌రెడ్డిని సంప్రదించగా బాలిక ఏడుస్తున్న సమయంలో పాలు పట్టడంతో కార్డియాక్ అరెస్ట్ జరిగిందని, తాము సీపీఆర్ చేసి మెరుగైన వైద్య కోసం ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. కాగా, పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

దూషించాడని మట్టుబెట్టాడు

●హత్య కేసును చేధించిన పోలీసులు ●నిందితుడికి రిమాండ్

మద్దూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి హత్య కేసును పోలీసులు చేధించారు. తనను దూషించాడన్న కారణంతో హత్యకు పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మద్దూరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ శ్రీను వెల్లడించారు. బైరగోని యాదగిరి తాటిచెట్లు ఎక్కేందుకు ఈ నెల13న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, 15న కూటిగల్ శివారులోని బ్రిడ్జి వద్ద అతడి మృతదేహం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెక్కల్ శివారులో బాలకృష్ణకు వ్యవసాయ భూములుండటంతో తరుచూ ఆ గ్రామానికి వెళ్లేవాడు. ఈ క్రమంలో యాదగిరి కుటుంబంలోని పాపకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో చికిత్స కోసం బైరాన్‌పల్లికి బైకుపై తీసుకెళ్లేందుకు బాలకృష్ణ ప్రయత్నించేవాడు. దీంతో అనుమానంతో యాదగిరి బాలకృష్ణను దూషించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతడు యాదగిరిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం కూటిగల్‌లోని వైన్స్‌కు అతడిని తీసుకెళ్లి మద్యం కొనుగోలు చేశాడు. అనంతరం యాదగిరి బైకును అక్కడే ఉంచి గ్రామ శివారులో మద్యం తాగేందుకు బాలకృష్ణ తన బైకుపై తీసుకెళ్లాడు. ఫుల్‌గా మద్యం తాగిన తరువాత యాదగిరిని బాలకృష్ణ దుడ్డు కర్రతో బాది హత్యచేశాడు. ఈ సమావేశంలో ఎస్ఐ షేక్ మహబూబ్, శిక్షణ ఎస్ఐ అరుణ్, ఏఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న చేర్యాల సీఐ

కరువు భత్యం విడుదల చేయాలి

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

మెదక్ అర్బన్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక సంఘ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అన్ని రకాల బిల్లులు చెల్లించాలన్నారు. ఈ నెల 22న ఉద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించామన్నారు. టీఎస్‌జీఎల్ఐ కార్యాలయాన్ని సంగారెడ్డి నుంచి మెదక్‌కు తరలించాలని, మెడికల్ సిబ్బంది ఏంపీహెచ్‌ఏలకు అదనపు ఇంటి అద్దె అలవెన్స్, ఏఈవోలకు సహాయకులను నియమించాలని జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ తీర్మానం ప్రవేశపెట్టగా ఆమోదించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా సహా అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఫజులొద్దిన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్, రాధా, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్, రామాయంపేట, చేగుంట, అల్లాదుర్గం, నర్సాపూర్, ఏడుపాయల వనదుర్గా యూనిట్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

● డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, అక్టోబరు18:(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి కృషి చేయాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా జట్టు ఎంపిక కోసం అండర్-17 బాలబాలిక విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి శివ్వంపేట, ద్వితీయ బహుమతి మెదక్, బాలికల విభాగంలో ప్రథమ నర్సాపూర్, ద్వితీయ శివ్వంపేట మండలం విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి డీఈవో హాజరై ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

నేడు జిల్లాకు హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి రాక

మెదక్ అర్బన్, అక్టోబరు18 : (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి శనివారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జస్టిస్ విజయసేన్‌రెడ్డి ఉదయం 8:15 గంటలకు ఏడుపాయల అమ్మవారి దర్శించుకుని, అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు అల్లాదుర్గంలోని కోర్టు కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తర్వాత మెదక్ చేరుకొని బార్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించి, మధ్యాహ్నం 2:30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని తెలిపారు. జస్టిస్ పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లతోపాటు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

నేడు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : కంది సమీపంలోని ఐఐటీహెచ్ డీపీవీ పాఠశాలలో నేడు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9492912008, 9014567800 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉత్సవ విగ్రహాలు చోరీ

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): మండలం పరిధి ఆరెపల్లి గ్రామంలో ని పెద్దమ్మ గుడిలో ఉత్సవ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రాయపోల్ ఎస్‌హెచ్‌వో రాజు కథనం ప్రకారం ఆలయంలో కొంతకాలంగా కాశమైన యాదయ్య, అండాలమ్మ దంపతులు ఆలయ సేవకులుగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగా గురువారం పూజలు చేసి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం గుడి రాగా తాళాలు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. దీంతో ఆలయంలోని పెద్దమ్మ, పెద్దిరాజు ఉత్సవ విగ్రహాలు కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గుడిలోని బంగారు ఆభరణాలు మాత్రం అలాగే ఉండడం గమనార్హం.

ప్రేమ వివాహంతో ఘర్షణ.. వరుడి ఇల్లు ధ్వంసం

● కేసు నమోదు చేసిన పోలీసులు



ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం కారణంగా వరుడి ఇంటిని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. రాయపోల్ ఎస్‌హెచ్‌వో రాజు కథనం ప్రకారం రాయపోల్ మండలంలోని ఒకే గ్రామానికి చెందిన అమ్మాయి, అబ్బాయిలు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వధువు కుటుంబ సభ్యులు శుక్రవారం వరుడి ఇంటిని ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతి



జిన్నారం, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. వావిలాల గ్రామానికి చెందిన నందిగామ కృష్ణ, వీరేశం, లక్ష్మీలకు చెందిన పాడి గేదెలు గురువారం గ్రామ శివారులో మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా తెగిపడిన విద్యుత్ వైర్లను తాకడంతో షాక్ గురై మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ, విద్యుత్ అధికారులు ఘటన వివరాలు సేకరించారు.

గురుకుల పాఠశాల భవనంపై నుంచి పడి

విద్యార్థినికి గాయాలు

పండుగ సెలవుల తరువాత వచ్చిన కొద్దిగంటల్లోనే ఘటన

ప్రమాదవశాత్తా.. ఆత్మహత్యయత్నమా !?





చికిత్స పొందుతున్న హిమబిందు, కాళ్లకు గాయాలు

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని జనగామ జిల్లా నర్మెట్ట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల భవనంపై నుంచి ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో కింద పడి తీవ్రగాయాపాలైంది. వివరాల్లోకి వెళ్లితే ములుగు జిల్లాకు చెందిన హిమబిందు గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నది. ఇటీవల దసరా పండుగ సెలవులకు ఇంటికి వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వచ్చింది. ఏమైందో తెలియదు కాని కాసేపటికి హిమబిందు భవనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడడంతో ఉపాధ్యాయులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె అప్పటికే అపస్మారక స్థితిలో ఉండటంతో అక్కడ ప్రథమ చికిత్స అందించి అనంతరం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. లేదా ఆత్మహత్యయత్నమా.. అన్న విషయం తేలియాల్సి ఉంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ మన్విచంద్‌ను సంప్రదించగా తాను సెలవులో ఉన్నానని, హిమబిందు కొన్నాళ్లక్రితమే పాఠశాలలో చేరిందన్నారు. భవనంపై దుస్తులు తీస్తున్న క్రమంలో గోడమీదనుంచి పడ్డానని తమతో హిమబిందు తెలిపిందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

5వ పేజీ తరువాయి..

కమిటీల కయ్యాలు

దీనిపై బీఆర్ఎస్ నేతలు కూడా సొంతంగా కమిటీలు వేసి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఐదుగురు సభ్యులను తమ పార్టీకి అనుకూలంగా ఉన్నవారినే ఎంచుకుంటున్నారు. కొన్ని చోట్ల ఏకంగా ఆయా పార్టీల గ్రామ అధ్యక్షులు, ముఖ్యనేతలకే కమిటీల్లో చోటు కల్పిస్తున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే ఈ కమిటీలపై పూర్తిస్థాయి ఆధిపత్యం కనబరుస్తున్నారనే చర్చ జరుగుతోంది.

అధికారులకు తలనొప్పిగా..

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సిద్ధం చేసిన ఇందిరమ్మ కమిటీల జాబితాలను ముందుగా ఎంపీడీవోకు, తర్వాత కలెక్టర్‌కు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే అందజేసిన జాబితాలపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీవోల వద్దకు చేరిన జాబితాల్లోనూ మార్పులు, చేర్పులు చేసిన సంఘటనలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. ఇక కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ఉన్న స్థానాల్లో అధికారులకు తలనొప్పి తయారైంది. ఓ గ్రూపు నుంచి వచ్చిన జాబితాను కలెక్టర్‌కు పంపిస్తే మరో గ్రూపు నుంచి ఏ సమస్య వచ్చిపడుతుందోనని ఆలోచిస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లా స్థాయి అధికారుల్లోనూ కనిపిస్తోంది. ఇక కాంగ్రెస్ జాబితాలకు పోటీగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ ఇందిరమ్మ కమిటీల జాబితాలు ఇవ్వడమే రసవత్తరంగా మారింది.

ఉమ్మడి జిల్లాకు 40వేల ఇండ్లు..

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున నిధులు అందజేస్తామని భరోసా కల్పించారు. స్థలం లేని పేదలకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో అర్హులకే ఇండ్లు దక్కాలని ఈ ఇందిరమ్మ కమిటీలకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యత అప్పగించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, సిద్దిపేట, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. సిద్దిపేట నూతన జిల్లాలో హుస్నాబాద్, జనగామ నియోజకవర్గంలోని 4 మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం ఉంది. ఈ లెక్కన సుమారు 40 వేల ఇండ్లు తొలిదశలో జిల్లాకు దక్కనున్నాయి. విమర్శలకు తావివ్వకుండా లబ్ధిదారులను ఎంపిక చేయడమే కమిటీల ముందున్న కర్తవ్యం.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం గజ్వేల్ మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయిని యాదగిరి(40) భార్య వాణి, కూతురు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చూస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన అతడు గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి కొండపోచమ్మ కెనాల్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కుటుంబ కలహాలతో యువకుడు...

వెల్దుర్తి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన కానికే శంకర్(22) వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శంకర్ తండ్రి వెంకటేష్ కొన్ని నెలల క్రితం మృతి చెందడంతో పిన తల్లి దుర్గమ్మతో గొడవ లు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా గొడవ జరగడంతో ఇంట్లో నుంచి బయటకెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి చెల్లి శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

-= సంక్షిప్తం =-

తపస్ మెదక్ జిల్లా మహిళా నూతన కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా మహిళా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా జంగిటి స్వరూప, ప్రధాన కార్యదర్శిగా రేఖసుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేజీఆర్, సాయివిల్లాస్, భరత్‌నగర్, అమీన్‌పూర్, ఎన్టీఆర్ కాలనీ, భరత్‌నగర్, నరేంద్రకాలనీ, సాయిఅంబికా, రాజరాజేశ్వరి, ఐలాపూర్ తండాలో, ఉదయం 10-30 నుంచి 11గంటల వరకు సాయివిల్లాస్, గ్రీన్‌విల్లాస్, ఆర్‌ఆర్.హోమ్స్, సన్‌వే ఓపస్ కాలనీలో, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు అమీన్‌పూర్ గ్రామంలో కొంతవరకు, చక్రపురి, శ్రీవాణినగర్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ధరణి, ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

రామాయంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధరణి, ప్రజావాణి సమస్యలపై దృష్టి సారించాలని మెదక్ ఆర్డీవో కె.రమాదేవి సూచించారు. శుక్రవారం ఆర్డీవో రామాయంపేట తహసీల్దార్ రజని, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది రోజువారి సమయపాలన పాటించాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు.

భాగిర్తిపల్లిలో నేటి నుంచి రేణుకాఎల్లమ్మ ప్రతిష్ఠ మహోత్సవాలు

చిన్నశంకరంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి నాలుగు రోజుల పాటు రేణుక ఎల్లమ్మ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమవుతాయని భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. శనివారం గోపూజ, ఆలయ శుద్ధి విగ్రహం ఊరేగింపు తదితర పూజలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ రాత్రి రేణుక ఎల్లమ్మ ఒగ్గు కథా కాలక్షేపం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే రోహిత్‌కు నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

కల్హేర్, పిట్లం రహదారికి రూ.2.70 కోట్లు మంజూరు

కల్హేర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్హేర్ - కామారెడ్డి జిల్లాలోని పిట్లం మండల కేంద్రాల మధ్య అంతర్‌జిల్లా రహదారి నిర్మాణం కోసం రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ రహదారుల శాఖ ద్వారా రూ. 2.70 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రహదారి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న తమ చిరకాల వాంఛ ఇన్నాళ్లకు నేరవేరనుండడంతో కల్హేర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరు కృషి చేసిన జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి, కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

దీర్ఘకాలిక వ్యాధులకు టోల్‌ఫ్రీ నంబర్ 1446 ద్వారా ఉచిత వైద్యసలహాలు

డిప్యూటీడీఎంహెచ్‌వో డాక్టర్ సృజన

నర్సాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక ప్రమాదకర వ్యాధులతో బాధపడేవారికి ఇంటి వద్దనే ఉండి వైద్య సలహాలు అవసరమైన మందుల విషయమై సమాచారం తెలుసుకోవడానికి వైద్యఆరోగ్యశాఖ 1446టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీడీఎంహెచ్‌వో డాక్టర్ సృజన తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ వైద్యులు, సిబ్బందికి ఈ విషయమై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలాచూడాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జ్ఞానేశ్వర్‌తో పాటు ఆయా పీహెచ్‌సీల సిబ్బంది ఉన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

పెద్దశంకరంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పెద్దశంకరంపేట మండల విద్యాధికారి డి.వెంకటేశం పేర్కొన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో స్ట్రీట్‌కాట్ వాటర్ ప్రాజెక్టు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. తాగునీటిని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేసినట్లు సంస్థ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, ఉపాధ్యాయులు, వాటర్ ప్రాజెక్టు స్వచ్ఛంద సంస్థ బాధ్యులు తదితరులుపాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన

నాగల్‌గిద్ద, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై శుక్రవారం నాగల్‌గిద్ద మండలకేంద్రంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి నాగ్‌నాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు గణేష్, విజయ్‌రెడ్డి, సూర్యకాంత్, బస్వరాజ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఇలా.. చదువులు ఎలా?



తరగతి గది ద్వారం ముందు నిలిపిన చెత్త సేకరణ వాహనం



పాఠశాల అవరణలో నిలిచిన వర్షపు నీరు

- సమస్యల వలయంలో మారేపల్లి ప్రాథమిక పాఠశాల
- 'నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిన నూతన భవనం పనులు
- మూడు తరగతి గదులకు పంచాయతీ భవనమే దిక్కు
- పెచ్చులూడుతున్న తరగతి గదులు
- చెత్త సేకరణ వాహనం, సామగ్రి నిల్వతో పాఠశాల ఆవరణలో దుర్వాసన

కొండాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లి గ్రామంలో గల పాఠశాలలో నెలకొన్న సమస్యలతో ఉపాధ్యాయులు, విద్యారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మన ఊరు-మన బడి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడమే కాకుండా, తాత్కాలికంగా వాడుకుంటున్న భవనం సరిగా లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతుండగా మొత్తం 69 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా ఐదు తరగతులకు గాను రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. మరో మూడు తరగతి గదుల నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈసారి విద్యా సంవత్సరం మొదలుకాగానే తప్పనిసరి పరిస్థితుల్లో తాత్కాలికంగా పంచాయతీ భవనాన్ని తరగతి గదులుగా వాడుతున్నారు.

రోడ్డుకు మరోవైపు తాత్కాలిక గదులు

తాత్కాలికంగా పంచాయతీ భవనాన్ని 3 తరగతి గదులుగా వాడుకుంటున్నారు. ఆ పంచాయతీ భవనం స్లాబ్ సిమెంటు పెచ్చులూడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గదుల లోపల పంచాయతీ నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రి, బయటి ద్వారం ఎదుట గ్రామంలో చెత్తసేకరణ చేసే వాహనాన్ని నిలుపుతుంటారు. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతూ దోమలకు అవాసాలుగా మారడంతో విద్యార్థులు వ్యాధులబారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళనపడుతున్నారు. ఇటీవల తరుచూ వర్షాలతో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతున్నది. రోడ్డుకు ఆవల ఈ భవనం ఉండడంతో ఈ రోడ్డు మార్గాన అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేక పనులు పెండింగ్

గత ప్రభుత్వ హయాంలో మనఊరి-మనబడి పనులు జరిగాయి. కాంట్రాక్టర్ చేసిన పనులకు నిధులు లేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమ్మఆదర్శ పాఠశాలల ద్వారా నిధులను మంజూరు చేసింది. 6నెలల్లో మండల పరిధిలో దాదాపు 20 పాఠశాలలకు పైగా అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పనులను పూర్తి చేయించాం. గతంలో చేసిన పనులకు నిధులు లేక పూర్తికాలేదు. నిధులు విడుదల కాగానే పనులను పూర్తి చేయిస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ఏఈ, కొండాపూర్

అర్ధాంతరంగా నిర్మాణం పనులు

రెండేళ్ల క్రితం మనఊరు - మనబడిలో నూతన భవనాలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు అందక చేసే పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. ఈ నిర్మాణంలో విద్యుత్ స్తంభాలను గోడలో కలుపుతూ పనులు కానిచ్చేశారు. దీంతో వర్షాలు పడితే భవనానికి, విద్యార్థులకు విద్యుత్ షాక్ తగిలే అవకాశం ఉంది. పాఠశాల ఆవరణలో, తరగతి గదుల పరిసరాల్లో వర్షపు నీరు నిలవడంతో తరగతికి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



విద్యుత్ స్తంభాన్ని నూతన భవనం గోడలో కలిపేసిన దృశ్యం

సన్న వడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

పలుచోట్ల వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, అధికారులు



చిన్నశంకరంపేట సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

చిన్నశంకరంపేట/రామాయంపేట/నిజాంపేట/హవేళిఘణపూర్/చేగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సన్న వడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు సెంటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు సన్న రకం ధాన్యానికి రూ. ఐదు వందలు ఇచ్చిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ సెంటర్ల ఆధ్వర్యంలో 473 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ధాన్యం అమ్ముకున్న రైతులకు వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు త్వరగా జమ అయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కాగా చిన్నశంకరంపేట సొసైటీ ఆధ్వర్యంలో, సూరారం గ్రామంలోని ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రోహిత్ ప్రారంభించగా ఆయన వెంట అడిషనల్ పీడీ సరస్వతి, డీపీఎం మోహన్, తహసీల్దార్ మన్నన్, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, ఏపీఎం లక్ష్మినారాయణ, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు. రామాయంపేట, ఉమ్మడి మండలం కోనాపూర్, నిజాంపేట, నస్కల్ గ్రామాల్లో 8 ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించగా ఆయన వెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి, వ్యవసాయాధికారులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా హవేళి ఘణపూర్, కూచన్‌పల్లి, సర్దన గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, ఏవో బాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు లక్కరు శ్రీనివాస్, పరుశురాం, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, అక్బర్, బాలకిషన్‌రావు, రాంచందర్ రావు, గోపాల్ నాయక్, రాము, గణేష్, తదితరులున్నారు. నార్సింగి మండలం శేరిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీడీవో అనంద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- కొల్చారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొంగోడు, నాయిని, జలాల్పూర్ గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కొంగోడు సీఈవో సాయిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మల్లేశకుమార్ ఉన్నారు.
- రేగోడు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పల్లి గ్రామంలో అధికారులు ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ కిష్టయ్య నాయకులు సంగమేశ్వర్, భద్రారెడ్డి, మాణిక్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత ఊరికి బస్సొచ్చింది



మొగుడంపల్లి మండలంలోని ఔరంగనగర్‌కు బస్సు రావడంతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

జహీరాబాద్,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రవాణవ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై ఆర్టీసీకి బస్సులకు సరైన కలెక్షన్‌లు రాక దాదాపు నాలుగేళ్ల క్రితం నియోజకవర్గ వ్యాప్తంగా 10రూట్లలో ఆర్టీసీ బస్సులను అధికారులు రద్దు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు నాలుగేళ్ల తర్వాత శుక్రవారం ఆర్టీసీ బస్సు తమ గ్రామానికి రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ, బస్సుకు తోరణాలుకట్టి, మంగళ హారతులు ఇచ్చి గ్రామంలోకి ఘనంగా స్వాగతం పలికారు. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ డిపో నుంచి మొగుడంపల్లి మండలంలోని ఔరంగనగర్‌కు సుమారు 25కిలోమీటర్లు దూరం ఉంటుంది. జహీరాబాద్ నుంచి చిన్న హైదరాబాద్, హోతి(బి), గోవిందాపూర్, మన్నాపూర్, రాయిపల్లితండా, మొగుడంపల్లి, గుడిపల్లి తదితర గ్రామాలనుదాటి ఔరంగనగర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దాదాపు నాలుగేళ్ల క్రితంవరకు(కరోనా కంటే ముందు) జహీరాబాద్ డిపో నుంచి ఔరంగనగర్ వరకు ఆర్టీసీఅధికారులు ఉదయం, సాయంత్రం పూట బస్సులను నడిపేవారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఆ తర్వాత ఆటోల సంఖ్య బాగా పెరిగింది. దీంతో ఆర్టీసీకి కలెక్షన్లు తగ్గి బస్సు సర్వీస్‌ను రద్దు చేశారు. నాలుగేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యను ఇటీవల సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి శుక్రవారం గ్రామానికి బస్సును నడిపించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని, అందరూ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



పుల్కల్: ఇసోజిపేటలో పత్తి పంటను పరిశీలిస్తున్న సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

పుల్‌కల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసోజిపేట గ్రామంలో సంగుపేట ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు పత్తి పంటను శుక్రవారం పరిశీలించారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త రాహుల్‌విశ్వకర్మ గ్రామ శివారులో సాగవుతున్న పత్తి పంటను రైతులతో కలిసి గమనించారు. పైరులో ఆకు ముడుత, కాయలు కుళ్లిపోయాయని ఈ లక్షణాలు కాయ కుళ్లు, తెగుళ్ల వల్ల ఆశించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరి, పత్తి పంటలో పాటించాల్సిన సమగ్ర ఎరువుల యాజమాన్యం సూచనలివ్వగా, మరో శాస్త్రవేత్త కె.సరిత రైతులకు సలహాలు ఇచ్చారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) శిబిరంలో భాగంగా మూడో రోజు శుక్రవారం రైతులకు భూసార పరీక్షలపై వలంటీర్లు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల అవశ్యకతను తెలుపుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని దీనివల్ల ఎలాంటి పంటలు వేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చనే విషయాలు తెలుస్తాయని సూచించారు. అనంతరం గణపతి చక్కెర కర్మాగారాన్ని సందర్శించి రైతులకు పంచదార తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. ఉపేందర్, డా. సుమాలిని, డా. రంజిత, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి పదోన్నతిపై బదిలీ

నర్సాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.అనిత పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఇక్కడ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన కాలంలో తనకంటు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పత్రికలలో ప్రచురితమైన సామాజిక అంశాలపై కూడా స్పందించి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేసి అందరి మన్ననలు అందుకున్నారు. అయితే జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న కె.అనిత సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది దేవరకొండ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు ఆమెను అభినందించారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నరేందర్‌రెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మనేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి అభివృద్ధి ఉపాధ్యాయులు సహకరించాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల అభివృద్ధికి వంతు సహాయ సహకారాలు అందిస్తానని నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోతిరెడ్డి, శ్రీనివాస్, రమేష్, మల్లేశం, సాయిలు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబరిమలైకి అయ్యప్పస్వాముల పాదయాత్ర

పటాన్‌చెరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి శుక్రవారం అయ్యప్ప దీక్షా స్వాములు పాదయాత్రగా శబరిమలై పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మలపాండురంగారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు.

తుల్జాపూర్ యాత్రికులకు పండ్ల పంపిణీ

నారాయణఖేడ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకునేందుకు ఖేడ్ నియోజకవర్గానికి చెందిన యువకులు పాదయాత్రగా బయలుదేరగా శుక్రవారం మహారాష్ట్రలోని ఉమార్గా వద్ద సురేష్ షెట్కార్ సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ వారిని కలిసి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, మహాలింగ్, పండరిచారి, సంగమేష్, సాయిచరణ్, జగన్, సోఫిరహిమాన్, తదితరులుపాల్గొన్నారు. అనంతరం రాకేష్ షెట్కార్ వారితో కలిసి తుల్జాపూర్ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

మానసిక దివ్యాంగులకు 'పిరమిడ్' ధ్యానం



పిరమిడ్ భవనంలో ధ్యానం చేస్తున్న మానసిక దివ్యాంగ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని జడ్పీ కార్యాలయ భవనం పక్కనే ఉన్న సబిత విభిన్న ప్రతిభావంతుల(మానసిక వైకల్యం)పాఠశాలలో ఇటీవలే పిరమిడ్ ఆకారంలో ధ్యాన కేంద్రాన్ని నిర్మించారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించే సుమారు 40మంది మానసిక దివ్యాంగులు నిత్యం ఈ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానం చేస్తుంటారు. పిరమిడ్ ఆకారంలో నిర్మించిన ఈ భవనంలో ధ్యానం చేయడం ద్వారా మానసిక వైకల్యంతో బాధపడే పిల్లలకు ప్రశాంతత లభిస్తుంది. పాజిటివ్ వైబ్రేషన్స్ వస్తాయని, పిల్లల్లో మంచి ప్రవర్తనకు దోహదం చేస్తాయని ఆ పాఠశాల కార్యదర్శి సరిత తెలిపారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

జహీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమించి రైతులను మోసంచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏవో లావణ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలుదుకాణాలను ఆమె తనఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల నిర్వాహకులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలన్నారు. ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన వైద్యాధికారి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) శుక్రవారం పీవోడీటీటీ(ప్రోగ్రాం ఆఫీసర్ ఆఫ్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ టీమ్-వైద్యాధికారి), యూపీహెచ్‌సీ డీడీవో డా.సుధా సందర్శించారు. సమస్యల వలయంలో 'యూపీహెచ్‌సీ' అనే శీర్షికన ఈ నెల 18 న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవి ఆదేశాల మేరకు పీవోడీటీ డా.సుధా, మరో మెడికల్ ఆఫీసర్‌తో కలిసి యూపీహెచ్‌సీని సందర్శించి అక్కడి సమస్యలపై ఆరా తీశారు. ఓపీ స్లిప్పులు, మంచి నీరు, ఇంటర్నెట్ లేకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కాగా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సంగారెడ్డి కలెక్టర్ ఆరా తీసినట్లు తెలిసింది.

నీటి సరఫరాలో సమస్యలు రాకూడదు



నీటి సరఫరా సహాయకులకు శిక్షణ ఇస్తున్న మిషన్ భగీరథ అధికారులు

కంది, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని మిషన్ భగీరథ ఈఈ షేక్‌పాష నీటి సరఫరా సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కందిలో మిషన్ భగీరథ అధికారులు గ్రామీణ నీటి సరఫరా కార్మికులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సింగిల్, త్రీ ఫేజ్ మోటార్ల రిపేర్లు, హ్యాండ్ పంపుల మరమ్మతులు, పైపులు జాయింట్లు కొట్టడం, నల్లా కనెక్షన్లు ఇవ్వడం, నీటి నాణ్యతపై పరీక్షలు జరపడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి, ఏఈలు రవి కుమార్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

చేగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ అధికారి సమయపాలన పాటించాలని చేగుంట మండల ప్రత్యేక అధికారి హైమవతి పేర్కొన్నారు. చేగుంట మండల ప్రత్యేక అధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. రెడ్డిపల్లి, అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నరెడ్డి, ఎంపీవో ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి పుష్ప, ఓపీవో స్వేత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏకపక్షంగా అధికార పార్టీ నాయకులు ఇచ్చిన పేర్లను కమిటీలో చేర్చడంతో పాటు అధికారులు పూర్తిగా కాంగ్రెస్‌పార్టీకి వత్తాసు పలకడం మంచిది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రమణరావు, రాజేందర్, అశోక్, విష్ణుతో పాటు బీజేపీ నాయకులు ఉన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీల నియామకం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు పారదర్శకంగా పని చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీలను సైతం ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా నిజాయితీపరులతో ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. గ్రామాలలో, వార్డుల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయాలన్నారు. కమిటీల ఏర్పాటులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన సునీతారెడ్డి



భీమ్లా తండాలో మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికపల్లి చౌరస్తాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాళ్లపల్లి తండా శివరాం దుర్గి, భీమ్లా తండాలో మృతి చెందిన శాంతి మమత, కుటుంబ సభ్యులను అలాగే జగ్యా తండాలో భార్య ఇద్దరు కూతుర్లను కోల్పోయిన మోహన్‌ను బాధిత కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆమె వెంట నాయకులు చంద్రగౌడ్, మన్సూర్ తదితరులు ఉన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

చేగుంట ,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యార్థి దశలోనే మూఢనమ్మకాల నిర్మూలనపై సరైన అవగాహన కల్పించినప్పుడే శాస్త్రీయ సమాజం వైపు మొగ్గు చూపుతారని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలల్లో మహిళల రక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మూఢనమ్మకాల ఆధారంగా భూతవైద్యులు చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి, శ్రీవాణి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలి

నారాయణఖేడ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని మండల నోడల్ అధికారి మన్మథకిషోర్ కోరారు. మండలంలోని ర్యాలమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామాజిక కార్యకర్తలు చంద్రశేఖర్ సహకారంతో శ్రీకర ఫౌండేషన్ వ్యవస్థాపకులు వినూష రూ.30 వేలతో సమకూర్చిన బ్యాగులను శుక్రవారం పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగసుజాతారాణి, నిజాంపేట మండల విద్యాధికారి రాములు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'వెంటనే డీఏలు మంజూరు చేయాలి'

పాపన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే డీఏలు మంజూరు చేయాలని పీఆర్టీయూ పాపన్నపేట మండలశాఖ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంతులు రాజు, సురేష్, రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి, లింగప్పలు పాపన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో కనీసం మూడు డీఏలు మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.